# 10 చీమ-పావురం

**నేపథ్యం:**

మబ్బులేమొ నీరునిచ్చు- నీరు తిరిగి మబ్బులిచ్చు...
పంటలేమొ గింజలిచ్చు- గింజలేమొ పంటలిచ్చు
ఒకరికొకరు సాయము ఇదే లోకన్యాయము......
ఇచ్చిపుచ్చుకొనుటలోనె ఉంది మహానందము-

అనువిధంగా చీమ, పావురం ఏం చేశాయో చూద్దాం!


చెరువు ఒడ్డునొక చెట్టుంది
చెట్టు మీద పావురముంది
గుట్టుగా లేత రెమ్మల్లో
కూర్చుని క్రిందకి చూసింది.

గట్టుమీదనే ఒక చీమ
గాలి షికారు చేస్తోంది
పొరపాటున అది జారిపడి
చెరువులోనికే తూలింది.

చీమ నీటిలో గిలగిలమంటూ
ఏమీ తోచక ఏడిస్తే
పావురమెంతో జాలిపడి
పచ్చని ఆకును రాల్చింది.

ఆకుమీది కా చీమపుడు
ఆరాటంతో ప్రాకింది
తన ప్రాణం నిలబడగానే
ధన్యవాదాలు చెప్పింది.





అప్పటినుంచీ ఆ చీమా
ఆ పావురమూ ఒక్కటిగా
కలసీ మెలసీ స్నేహంగా
కాలక్షేపం చేసేవి.

కొమ్మ మీద ఆ పావురము
కూర్చుని ఉన్నది ఒకరోజు
విల్లూ అమ్ములు పట్టుకుని
వేటగాడొకడు వచ్చాడు.

అమాయకంగా పావురము
ఆలోచిస్తూ ఉంటేను
వేటగాడేమొ గురిచూసి
వెయ్యబోయాడు బాణం.

వాడి ఆశపసికట్టింది
ప్రక్కనే ఉన్న చీమపుడు
కాలివేలొకటి పట్టుకుని
గట్టిగా కుట్టివేసింది.

బాణం తన గురి తప్పింది
పావురం ఎగిరిపోయింది
చీమ చూడగా చిన్నదే
చేసిన సాయం పెద్దది.

**ఒకరికొకరి సాయం – ఇదే లోక న్యాయం**

## I. వినండి-సంభాషించండి.

1. మీకు ఇతరులు సహాయం చేసిన సన్నివేశాన్ని వివరించండి.
2. వలలో చిక్కిన పావురాలను ఎలుక విడిపించిన కథను చెప్పగలరా.
3. సంఘసేవ చేసిన మదర్ థెరీసా గురించి పది వాక్యాలు చెప్పండి.

## II. కొత్త పదాలు నేర్చుకుందాం.

ఆరాటం = తపన; ధన్యవాదాలు = కృతజ్ఞతలు; అమ్ములు = బాణాలు; పసికట్టు = గ్రహించు.

## III. చదవండి-చెప్పండి-రాయండి.

### అ. సరియైన సమాధానం గుర్తించి రాయండి.

1. పావురం కూర్చుని ఉన్నది.
   (అ) ఒడ్డున (ఆ) చెరువులో
   (ఇ) రెమ్మల్లో (ఈ) ఆకుమీద
2. గట్టుమీద షికారు చేస్తున్నది.
   (అ) చీమ (ఆ) వేటగాడు
   (ఇ) పావురం (ఈ) ఆకు

### ఆ. ఒక్క వాక్యంలో సమాధానం రాయండి.

1. చీమ చెరువులోనికి ఎందుకు తూలింది ?
2. జాలిపడిన పావురం ఏం చేసింది ?
3. చీమ పావురానికి ఎందుకు ధన్యవాదాలు తెల్పింది ?
4. వేటగాడు ఏవిధంగా వచ్చాడు ?
5. పావురాన్ని చూసిన వేటగాడు ఏం చేయబోయాడు ?

### ఇ. మూడు, నాలుగు వాక్యాల్లో సమాధానాలు రాయండి.

1. పావురం ఎందుకు జాలిపడింది ?
2. చీమను పావురం ఎలా రక్షించింది ?
3. వేటగాడి బారి నుండి పావురాన్ని చీమ ఎలా కాపాడింది ?

### ఈ. ఖాళీలు పూరించండి.

1. చెరువు ________ చెట్టుంది.
2. పావురమెంతో జాలిపడి ________ ను రాల్చింది.
3. తన ప్రాణం నిలబడగానే ________ చెప్పింది.

## IV. భాషావగాహన

### అ. సొంత వాక్యాల్లో ఉపయోగించండి.

1. పొరపాటున 2. గిలగిలమంటూ
3. ఆరాటంతో 4. కాలక్షేపం
5. పసిగట్టు 6. గురితప్పు

### ఆ. గీతగీసిన పదాలు ఏ భాషాభాగాలో రాయండి.

1. <u>చీమపుడు</u> <u>ఆరాటంతో</u> ప్రాకింది.
2. <u>అమాయకంగా</u> <u>పావురము</u> ఆలోచిస్తోంది.
3. కాలివేలొకటి పట్టుకొని <u>గట్టిగా</u> కుట్టివేసింది.

### ఇ. కాలాలు గుర్తించండి.

1. చీమ షికారు చేస్తున్నది.
2. చీమ ధన్యవాదాలు చెప్పింది.
3. వేటగాడు బాణం వేయబోయాడు.

### ఈ. ఉక్తలేఖనం

1. ధన్యవాదాలు 2. కాలక్షేపం 3. బాణం



## V. గ్రంథాలయ సమయం :-

గ్రంథాలయంలోని పంచతంత్ర కథలను చదివి తరగతిలో సంభాషిద్దాం.

**నేనివి నేర్చుకున్నా.**

- ఫలితాన్ని ఆశించకుండా సహాయపడాలి.